క్లుప్తంగా

కొనసాగుతున్న తాళం భజన పోటీలు



చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహిస్తున్న జిల్లాల స్థాయి తాళం భజన పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వక్కలగడ్డకు చెందిన శ్రీ వెంకటేశ్వర భజన సమాజం, మంతెనకు చెందిన శ్రీ సీతారామాంజనేయ భక్త సమాజం, అమీనాపురానికి చెందిన శ్రీ రాజ రాజేశ్వరి భజన సమాజం, కొడాలి గ్రామానికి చెందిన శ్రీ రామ భక్త సమాజం వారు బృందాలుగా శుక్రవారం తాళం భజన నిర్వహించారు. కొడాలి పీఏసీఎస్ ఛైర్పర్సన్ గుత్తికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, పి.శ్రీనివాసరావులు వ్యవహరిస్తున్నారు. దాసరి సతీష్, యలవర్తి వంశీ, వేములపల్లి సుధీర్, పరుచూరి వెంకటేశ్వరరావు, వాకా రాకేష్, గుత్తికొండ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పీఏసీఎస్ కార్యదర్శి బోగాది లంకేశ్వరావు మృతి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలోని నాగాయతిప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యదర్శి బోగాది లంకేశ్వరావు(52) అనారోగ్యంతో విజయవాడ ప్రైవేటు హాస్పటల్‌లో శుక్రవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం పెదకళ్లేపల్లికి మృతదేహాన్ని తరలించారు. సమాచారం అందుకున్న అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు వెంకట్రామ్ పెదకళ్లేపల్లిలో మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కడవకొల్లు సీతారామాంజనేయులు, గొర్రెపాటి దుర్గానాగేశ్వరావు, కోసూరు నాగమల్లేశ్వరావు, మురాల సుబ్బారావు, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సల్మా సుల్తానా, మండలంలోని పలు సొసైటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

కోనేరుసెంటర్: క్లాప్ మిత్రాలు పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని మచిలీపట్నం ఎంపీడీవో సీహెచ్ వెంకటేష్ పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా పంచాయతీల్లో క్లాప్ మిత్రాలుగా సేవలందిస్తున్న స్వచ్ఛ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలకృష్ణారావు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

టి.కొత్తపాలెం(నాగాయలంక): మండలంలోని సొర్లగొంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టి.కొత్తపాలెంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేకనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షేక్ రియాజ్ నేతృత్వంలో 210 మంది మహిళలకు వైద్య పరీక్షలు జరిపారు. సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతి ప్రారంభించారు.

గూడూరు: మండల పరిధిలోని పోసినవారిపాలెం పంచాయతీలో మల్లవోలు పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. మల్లవోలు పీహెచ్‌సీ హెచ్‌వీ సరళ, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌వో శోభన, ఏఎన్‌ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలి

పెడన: బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లించడం ద్వారా వారికి మళ్లీ రుణాలు మంజూరు విషయంలో సులభంగా ఉంటుందని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి 2.0లో భాగంగా లోక్ కళ్యాణ్ మేళ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూబీఐ మేనేజర్ రవీంద్ర, ఎస్‌బీఐ మేనేజర్ శంకర్రావు, సప్తగిరి బ్యాంకు మేనేజర్ రాజ్యలక్ష్మి, బీవోఐ మేనేజర్ గాయత్రి, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

మచిలీపట్నం టౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం స్వానిధి 2.0, లోక కళ్యాణ్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం పథకాలపై అవగాహన కార్యక్రమం మెప్మా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



చల్లపల్లి మండలం రామానగరంలో రూ.5,55,811ల కరెన్సీ నోట్లతో అమ్మవారికి అలంకరణ






నాగాయలంకలోని అమ్మవార్లు



లక్ష్మీదేవిగా కోడూరు గంగాభవానీ



కొక్కిలిగడ్డలో మహాలక్ష్మిగా భ్రమరాంబ



పెడనలోని కన్యకాపరమేశ్వరి దేవి



అడ్డపర్రలో శ్రీమహాలక్ష్మీదేవిగా అమ్మవారు



తరకటూరులోని అమ్మవారు



పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో..



అవనిగడ్డ లంకమ్మ అమ్మవారి ఆలయంలో..



మచిలీపట్నం పట్టణంలో ధనలక్ష్మీ దేవిగా అమ్మవారు



గజలక్ష్మిగా విశ్వనాథపల్లి నాంచారమ్మ

క్షీరసాగర జనని నమోస్తుతే

మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో దసరా శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాలు, ఆలయాల్లో కొలువైన జగన్మాతను శుక్రవారం శ్రీ మహాలక్ష్మీ దేవిగా అలంకరించారు. స్థానికులు తమ శక్తి కొలదీ కరెన్సీ నోట్లతో అమ్మను అందంగా తీర్చిదిద్దారు. సిరులనిచ్చే శ్రీలక్ష్మీ చిరునవ్వులతో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చన కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్నారు. ఒక చేత్తో అభయం, మరో చేత్తో సిరులు, రెండు చేతుల్లో కమలాలు పట్టుకుని పద్మంపై కూర్చున్న క్షీరసాగర జననిని చూడటానికి భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పూర్ణాలు, పొంగళ్లను జగన్మాతకు నైవేద్యంగా సమర్పించి తల్లిముందు ప్రణవిల్లారు. –సాక్షి నెట్‌వర్క్



ఘంటసాలలో కూచిపూడి నృత్యంలో చిన్నారులు



పెడనలో తీర్థపు బిందె ఊరేగింపులో భక్తులు



నాగాయలంకలో హోమం కార్యక్రమం

సూరపనేని కుటుంబ సేవలు ఆదర్శనీయం



కార్యక్రమంలో నిర్వాహకులు, సూరపనేని వెంకట్రావు కుటుంబ సభ్యులు

తాడేపల్లి(ఘంటసాల): చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వైద్యులతో నాణ్యమైన కంటి పరీక్షలు, ఆపరేషన్లు చేయించిన ఎన్నారై సూరపనేని శ్రీనివాస్–నాగప్రియ దంపతుల సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు తెలిపారు. తాడేపల్లి మలయాళ స్వామి పెద్దాశ్రమంలో సూరపనేని కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి పొర చికిత్స శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 638 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. డాక్టర్ ఎలెక్స్, డాక్టర్ ఓవియాలు కంటి పొర శస్త్ర చికిత్సలు నిర్వహించగా నేత్రాలయ సిబ్బంది నాగమణి, మురుగన్, సత్యరాజ్, సర్వణన్, కరుప్పా స్వామి, భూబాళన్, ప్రీతి, ఏంజిల్, అడ్మినిస్ట్రేషన్స్ జి.రంజిత్ కుమార్, డి.మెజెస్, ఆల్బర్ట్, జగన్, ఆష్తమ్స్ అశ్విన్, కిషోర్ కుమార్, టోని, ఇతర సిబ్బంది, ఘంటసాల జెడ్పీ హైస్కూల్ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తమ సేవలను అందించారని వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సూరపనేని వెంకట్రావు, వెంకట సుబ్బమ్మ, హనుమానుల సురేంద్రనాద్ బెనర్జీ, పరుచూరి సుబాష్ చంద్రబోస్, పొట్లూరి అజయ్ కుమార్, నీరజ, హనుమానుల కుమార్, గీత, గొర్రెపాటి సురేష్, పద్మజ, మొవ్వ శ్రీరామమూర్తి, యార్లగడ్డ వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న సింహాద్రి వెంకటేశ్వరరావు

అవనిగడ్డ: ప్రజల కష్టాలపై మాట్లాడడం చేతకాని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడడం హేయమైన చర్యంటూ జిల్లా వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. శుక్రవారం అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. దేవాలయంగా భావంచే అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

నాగాయలంక: ఏపీ శాసన సభ సాక్షిగా ఎమ్మెల్యే బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై చేసిన అనుచిత వాఖ్యలను వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు తీవ్రంగా ఖండించారు. నాగాయలంకలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. బాలకృష్ణ భాష, సంస్కారం చూస్తే ఆయన స్థాయి ఏపాటిదో ప్రజలకు అర్థమవుతుందని విమర్శించారు. బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలని రంగారావు డిమాండ్ చేసారు.

చల్లపల్లి: ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని.. వెంటనే ఆ వ్యాఖ్యలను బాలకృష్ణ వెనక్కు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ చల్లపల్లి మండల మైనార్టీ సెల్ నాయకులు జుజ్జువరపు భాగ్యారావు డిమాండు చేశారు. బాలకృష్ణ మానసిక పరిస్థితి సరిగా లేదని భాగ్యారావు అన్నారు.

డయల్ యువర్ డీఎం నేడు

అవనిగడ్డ: అవనిగడ్డ ఆర్టీసి డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ప్రజలు తమ ప్రయాణ అవసరాలపై సూచనలు, సలహాలను నిర్ణయించిన సమయంలో 99592 25466 నంబరులో సూచించాలని ఆయన కోరారు.

దారపు శ్రీనివాసరావుకు పేర్ని నాని నివాళులు



చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ ఎన్జీవో సంఘ నేత, రిటైర్డ్ ఎంపీడీవో దారపు శ్రీనివాసరావుకు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. నగరంలోని పరాసుపేటలో గల ఆయన స్వగృహం వద్ద శుక్రవారం మృతదేహాన్ని సందర్శించేందుకు పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు తరలివచ్చి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మాత, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం



మచిలీపట్నం అర్బన్: కిల్కారి సేవలతో మాత, శిశు మరణాలు తగ్గించడమే లక్ష్యమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అంబటి వెంకట్రావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని ఆరోగ్య సేవలతో పాటు కిల్కారి సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు ఎక్కువ సంఖ్యలో కిల్కారి కాల్స్ వినేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే కిల్కారి కాల్ నంబరు 911600103660ను గర్భిణులు తమ మొబైల్‌లో సేవ్ చేసుకోవాలన్నారు. కాల్ మిస్ అయినా, తిరిగి వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి వినవచ్చని తెలిపారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్, ప్రోగ్రాం ఆఫీసర్లు, కిల్కారి రీజినల్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): జీఎస్టీ 2.0 సంస్కరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడి ఏ వస్తువు ఎంత పన్ను తగ్గిందనే అంశాలను పట్టణ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ప్రజలకు తెలిసేలా ప్రకటనలు జారీ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ట్రైనీ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఏఎస్పీ వీవీ నాయుడు, కెమర్షియల్ టాక్స్ అడిషనల్ కమిషనర్ బాలాజీ బాబు, జాయింట్ కమిషనర్ కల్పన, మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, చంద్రశేఖరరెడ్డి, మనోహరరావు, బి.రమ్య పాల్గొన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లాకు సంబంధించిన అంశాలు, ప్రస్తావించిన సమస్యలపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు.

తగ్గిన ధరలకే విక్రయాలు జరపాలి..

పెడన: తగ్గిన ధరలకే వస్తువులను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మచిలీపట్నం తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్‌యూ భానుప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక వాసవీ ప్రార్థనా మందిరంలో పట్టణంలోని వర్తక, వాణిజ్య సంఘ నాయకులు, వర్తక వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. పరిశీలకులు ఎస్.ఈశ్వరరావు, వర్తక, వాణిజ్య విభాగం పట్టణ అధ్యక్షుడు బి.బాలరాజు, సంఘ నాయకులు కె.చంద్రశేఖర్, బి.నాగేశ్వరరావు, గోవిందులు పాల్గొన్నారు.

చిట్టూర్పు(ఘంటసాల): తగ్గిన జీఎస్టీపై చిట్టూర్పు గ్రామంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. దీంతో కలిగే ప్రయోజనాలను వారు ప్రజలకు తెలియజేశారు.

బెంబేలెత్తిస్తున్న వానరాలు!

పిల్లలను వదిలి పనులకు వెళ్లాలంటే హడలిపోతున్న ప్రజలు



మాచవరం వద్ద ప్రధాన రహదారిపై వానరాల గుంపు

కోడూరు: వానరాల బెడదతో కోడూరు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోతులు గుంపులు గుంపులుగా ఇళ్ల పైకి వచ్చి దాడులకు పాల్పడడంతో బయటకు రావాలంటే ప్రజలు హడలిపోతున్నారు. కోడూరు పంచాయతీ పరిధిలోని వడ్డెరకాలనీ, మెరకగొడపాలెం, సంతమార్కెట్, వీవర్స్‌కాలనీ, కృష్ణాపురం గ్రామాల్లో వానరాలు అధికంగా సంచరిస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇళ్లపైకి వచ్చి గుంపులుగా దాడి చేయడంతో ఇంటి రేకులు పగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి ప్రభావంతో పై గ్రామాల ప్రజలు పనులకు కూడా వెళ్లకుండా ఇళ్ల వద్దే ఉండి కాపాలా ఉండాల్సిన పరిస్థితి నెలకొందని.. పిల్లలపై దాడి చేస్తాయోనని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటీవల వడ్డెరకాలనీ, మెరకగొడపాలెం గ్రామాల్లో వానరాల దాడిలో గ్రామస్తులు గాయపడి ఆసుపత్రి పాలైన ఘటనలూ కోకొల్లలు. అధికారులు తక్షణమే స్పందించి వానరాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దుకాణాలు తొలగించాలంటూ నోటీసులు

పెడన: జిల్లా కలెక్టర్‌కు ఆదేశాల పట్టణంలోని ఎంపీపీ(బంగ్లాస్కూలు)వద్ద గోడలకు నోటీసులు అంటించామని మండల పరిషత్ అధికారులు తెలిపారు. శుక్రవారం స్కూలు గోడలకు స్థానికంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలంటూ ఎంపీడీవో కార్యాలయం ఏవో కె.శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారిలు నోటీసులు అంటించారు. దుకాణాలను తొలగించాలని, గ్యాస్ సిలిండర్లతో స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన టిఫిన్ బండ్లు, పలు షాపులను తొలగించాలని ఎంపీడీవో అరుణకుమారి పేర్కొన్నారు. ఎటువంటి సమాచారం లేకుండా నోటీసులు అంటించడంపై చిరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత

మచిలీపట్నం అర్బన్: ఆర్థిక ఇబ్బందులు చదువుకు అడ్డంకులు కాకూడదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎ.వెంకట్రావు తెలిపారు. తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెప్రా సొసైటీ ద్వారా జిల్లాలో ఎంపికైన 10 మంది పేద, బలహీన వర్గాల విద్యార్థులకు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం చేయడం విద్యార్థులకు మంచి ప్రోత్సాహంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ రాధిక, ప్రాజెక్ట్ అసోసియేట్ అబ్దుల్ వహీద్ బాషా, డీఎస్ఎంవో డాక్టర్ వేణుగోపాల్, నాగవాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

చిలకమర్తి సేవలు ఎనలేనివి

మచిలీపట్నం టౌన్: కళా ప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు జయంతి కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకమర్తి చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. చిలకమర్తి నాటక రచనల్లో గణపతి, గయోపాఖ్యానం, శ్రీకృష్ణార్జున యుద్ధం తదితరాలు ప్రముఖమైనవని రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ బి.విజయ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు నిండే వరకూ తల్లిపాలు తప్పనిసరి

పెడన: చిన్నారులకు ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని, అందుకు బాలింతలు పౌష్టికాహారం తీసుకుని పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధతీసుకోవాలని బంటుమిల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎం.సముద్రవేణి అన్నారు. శుక్రవారం పెడన సెక్టారు పరిధిలోని పట్టణంలో అంగన్‌వాడీ సెంటర్ల అధికారులందరికీ భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్‌ఎస్‌లో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే పుట్టే పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని సీడీపీవో అన్నారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ కొసనం కరుణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలి

దేవరకోట(ఘంటసాల): గర్భిణులు, బాలింతలు వెయ్యి రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ఘంటసాల సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమా నాగమణి అన్నారు. ఘంటసాల మండలం దేవరకోట అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ కాంతారావు, ఏఎన్ఎం డి.సునీత, మహిళా పోలీసు మాధురి, అంగన్‌వాడీ కార్యకర్తలు బేబీ షామిలి, భవానీ, బసవలక్ష్మి, పుణ్యవతి, దీవెన, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

29న కౌన్సిల్ సాధారణ సమావేశం

పెడన: కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం హాలులో జరుగుతుందని మున్సిపల్ ఛైర్పర్సన్ కటకం నాగకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం జరిగే కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని 29 అంశాలకు సంబంధించి ఆమోదించేందుకు తీర్మానం చేయనున్నట్లు వివరించారు. కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా ఆమె ఆ ప్రకటనలో కోరారు.